# బర్త్ సర్టిఫికెట్

కొలకలూరి ఇనాక్

**రెండేళ్ళ కొడుకు, పదేళ్ళ పనిపాప తోడుగా రమణి మెటర్నిటీ వార్డుకు వచ్చి అడ్మిట్ అయింది.**

**నెలలు నిండిందాకా ఆమె హాస్పటల్లో చేరలేదు. నొప్పులు వస్తున్నాయి. కాన్పు ఏమాత్రం ఆలస్యం అయ్యేట్టుగా లేదు. వార్డులో బెడ్డు దగ్గరకు కాక కాన్పుల గదికే సరాసరి తీసుకుపోయారు.**

**కొడుకు, పాప, వరండాలో ఉండిపోయారు. పెద్దవాళ్ళెవరూ వాళ్ళ వెంట లేరు.**

ఆసుపత్రి హడావుడిగా ఉంది. కాన్పుల వార్డు మరీ రద్దీ గోలా! పుట్టినవాళ్ళ గోల, పుట్టని వాళ్ళు కలిగించే గోల. వాళ్ళ కోసం, వీళ్ళకోసం వచ్చినవాళ్ళ మాటలు, అరుపులు, కేకలు. కాన్పుకాని మనిషి గావుకేకలు, నర్సులు, ఆయాలు, డాక్టర్లు పనివాళ్ళు వస్తూపోతూ చేసే హంగామా. అదొక వింత లోకం. ఈ లోకానికి కొత్తలోకం ప్రసాదించే వింత లోకం.

అక్కడ ఏడ్పు ముఖ్య విషయం. తల్లి ఏడుస్తుంది. తల్లి కాబోయే ఆడకూతురు ఏడుస్తుంది. పిల్లలు ఏడుస్తారు. నొప్పులు వచ్చి ఏడుస్తారు. కనలేని ఏడ్పులు. వాటిని విని కన్నవాళ్ళ ఏడ్పులు. ఏడుపులో కూడా ఆనందం. నిజంగా వింత లోకమే.

కాన్పుల గదిలో రమణి ఏడవటంలేదు. అరవటం లేదు. వరండాలో పిల్లలు కిక్కురుమనటంలేదు.

రమణికి కాన్పు అవుతుందని నర్సులు, డాక్టర్లు, ఆయాలు, తోటీలు ఒకటే ఉరుకులు పరుగులు.

రమణి కాన్పుల గదిలోకి పోతూ కొడుకును ముద్దాడింది. పాపను తలనిమిరింది.

హాస్పటల్‌కు ఏ బంధుమిత్రులూ రాలేదు. ఇరుగు పొరుగూ రాలేదు. ఎవరికీ చెప్పలేదు. ఆమె కాలేజీకి పోయినట్లే ఇక్కడికీ వచ్చింది.

ఆమె నొప్పులు పడుతున్న ఆచూకీ లేదు.

'తోడులేరా?' ఎవరో అడిగారు. పాపకు ఏంచెప్పాలో తెలియదు. చెప్పలేదు.

వార్డులో ఉన్నవాళ్ళు, పెద్దవాళ్ళు, ఆడవాళ్ళు కాన్పుల గదిలోంచి అరుపులు వినబడితే ఆనందంగా ఉంటారు. అరుపులు లేకపోతే ఆందోళనగా ఉన్నారు. నొప్పులు రాలేదా? ఆగిపోయాయా? ఏమైనా అన్యాయం జరిగిందా? బైటివాళ్ళ బాధ ఎక్కువయింది.

'ఆయప్ప రాలే?' ఎవరో అడిగారు. ఎవర్నో అడిగారు. ఎవరూ బదులు చెప్పలేదు.

'సాంవీ- యాంవయిందప్ప?'

జవాబు చెప్పే వాళ్ళే లేరు.

రమణికి కాన్పు అవుతూ ఉందని, ఆమె నొప్పులు ఓర్చుకొంటూ ఉందని వాళ్ళే తెలుసుకోగలిగారు.

రమణి కొడుక్కు ఎవరో పాలు గ్లాసుతో తెచ్చి ఇచ్చారు. తాగాడు. పనిపాప తాగలేదు. టిఫిన్ తిని వచ్చామని చెప్పింది.

కాన్పుల గదిలో నిశ్శబ్దం.

ఉన్నట్టుండి, నిశ్శబ్దాన్ని చీలుస్తూ పసిగొంతు కెవ్వమంది.

ఆ ఏడుపు ఎంత ఆనందం!

ఆ పసిగొంతు ఎంత ప్రమోదం!

వరండాలో ఉన్న ఆడవాళ్ళు, నెత్తికెత్తుకొన్న కొండ దించుకొన్నంత సంతోషం!

'పోన్లేక్కా, పోన్లేమ్మా' అంటూ ఒక్కొక్కరు కాన్పుల గది వరండాలో నుంచి. తమ వాళ్ళున్న బెడ్డుల దగ్గరకు నెమ్మదిగా చేరుకొంటున్నారు.

పసిగొంతు పరమ దౌర్జన్యంగా నిశ్శబ్దాన్ని చీల్చి చెండాడుతూ ఉంది. తల్లి మూలుగు కూడా లేదు.

ఆయా బిడ్డను తీసుకొని పోయింది. ఈ ప్రాణికి ప్రథమస్నానం.

తోటి బకెట్ తీసుకొని వెళ్ళిపోయాడు.

నర్సులు స్ట్రెచర్ తోసుకొని వచ్చారు. రమణి ఉంది. కొడుకు తల్లిని పట్టుకున్నాడు. రమణి ముద్దాడింది. పనిపాప దగ్గరకు వచ్చింది. రమణి పాప తల నిమిరింది.

'నొప్పులు రాలే?' రమణి చెప్పింది 'వచ్చేయి!' 'మల్ల?' 'ఏడవలేదు' 'యాల?' 'ఏడవాలనిపించలేదు!'

గవదలకు పళ్ళకు అతుక్కుపోయిన అవ్వ బుగ్గలు అప్పుడు యథాస్థానంలోకి వచ్చాయి.

'ఏడుపురాలే?' అవ్వ ఉండబట్టలేక అడిగింది.


'నొప్పి వస్తుందనీ తెలుసు. పురుడు రాగానే పోతుందనీ తెలుసు.'

మొగ్గల్లాంటి అవ్వ కళ్ళు పూలు అయిపోయాయి.

అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలోకి అన్నాలు తెచ్చేవాళ్ళ హడావుడి జాస్తి అయింది.

ఏడుపు గొంతుక్కట్టేసి, పెదాల తలుపులు బిగించింది. ఇంత ఓర్పా? అవ్వ కళ్ళు చక్రాలయ్యాయి.

కనీపెంచే కాలంలో అవ్వకు ఆరు కాన్పులు. ఆరు సార్లూ ఇల్లు పీకి పందిరేసింది. పందిరి పీకి ఇల్లేసింది. అవ్వ పీకిన పందిరినైనా, ఇంటినైనా సరిచేసేవాళ్ళు



మనిషి తేటగా ఉంది.

స్ట్రెచర్‌తోపాటు పసివాళ్ళు నడిచి వచ్చారు. రమణిని బెడ్‌మీదకు చేర్చారు. పిల్లలు ఆమె తల దగ్గర చేరారు. ఆమెనెవరూ ఓదార్చలేదు. ఆమె పిల్లల నిద్దరినీ ఓదార్చినట్లుగా ఉంది. ఫిమేల్ వార్డులో ఉన్న ఆడవాళ్ళంతా ఆమెను చూస్తున్నారు కానీ దగ్గరకు రాలేదు. పిలిస్తే పలికేట్టున్నారు. రమ్మంటే వచ్చేట్టున్నారు.

వీళ్ళకు రమణి వింతమనిషిగా ఉంది. నెలలు నిండిన మనిషి కాన్పుల గదిలోకి పోయింది. కాన్పు అయిన మనిషి వార్డులో బెడ్‌మీదకు చేరింది. ఆమెకు కాన్పు అయిన ఆచూకీ లేదు. 'అట్టా లోనికి పాయె. ఇట్లా యెల్లుకొచ్చే' నొప్పులు పడలేదు. అరవలేదు. కేకలు పెట్టలేదు. గోలచేయలేదు. ఏడవలేదు. కనీసం మూలగలేదు. పైగా నవ్వొకటి! కాన్పుకు ముందు వచ్చింది, కాన్పు చేసుకొని బెడ్ మీదికి చేరింది. హాస్పటల్‌కి వచ్చే ముందు వంటచేసి పిల్లలకు పెట్టి తీసుకువచ్చింది.

"ఎవులూ లేరా?'

'పురుడింత సులువా?'

ప్రసూతి వైరాగ్యం ఎవరికీ రాలేదు.

స్నానం చేయించిన పాపను తెచ్చి బెడ్‌పక్క ఉయ్యాలలో పడుకోబెట్టింది ఆయా.పాప నిద్రపోతూ ఉంది.

అప్పుడు అమ్మలక్కలు ఒక్కొక్కరు రాసాగారు.

పసికందును చూచి పరవశించిపోతున్నారు. బాగుందనీ, బరువుందనీ, బంగారమనీ అనుకొంటున్నారు.

పక్క బెడ్‌లోని మనమరాలి అవసరాలు చూడటానికి వచ్చిన అవ్వ అరగంట కింద నొక్కుకొంటే లోనికి పోయిన బుగ్గ ఇంకా వెలుపలికి రాలేదు. ఆమె ఆశ్చర్యానికి అంతేలేదు.

అందరూ వస్తూ పోతున్నప్పుడు అవ్వ అడిగింది.

లేకపోలేదు.

అటువంటివాళ్ళు రమణికి లేకపోయారు. అందువల్ల ఆమె ఏంచేసినా గొంతు నొప్పే మిగిలేది. ఎందుకు వచ్చిన నొప్పి. మౌనమే శరణ్యం.

యాగిటంటీ అవ్వ ఎగిరి గంతేసేది. కాన్పంటేనే కష్టం. కనేపని లేకపోతే ఎన్నిసార్లు కడుపువచ్చినా సంతోషమే. నెల తప్పితే ఎంత పరామర్శ! నెలలు నిండుతుంటే ఎంత భోగం! నిండు మనిషంటే ఎంత మన్నన! అంతా బాగుంటుంది. కాన్పే కష్టం.

రమణికి అంతా బాగాలేదు. కాన్పు కష్టమూ కష్టం కాదు.

మొదట కాన్పుకు కూడా రమణి అరవలేదు. గోల చేయలేదు అంటే ఆశ్చర్యం. వార్డుకంతా వింత.

సుఖప్రసవమని, అదృష్టమని, దైవసృష్టి అనీ ఆడవాళ్ళు అనుకోసాగారు.

అటెండరు వస్తూ కేరియర్ తెచ్చాడు. పిల్లలు తిన్నారు. రమణి కాళ్ళ దగ్గర పనిపాప కూర్చుంది. కొడుకు పక్కలో నిద్రపోయాడు.

ఉయ్యాలలో పాప కదిలింది. అవ్వ పాపనెత్తి రమణి పక్కలో ఉంచింది. పాప నిద్రపోతూనే వుంది. తల్లి తలనిమురుతుంటే హాయిగా నిద్రపోతూనే వుంది.

మేడమ్ డెలివరీ అయిందనీ, క్లాసు కేన్సిల్ అనీ స్టూడెంట్స్‌కు తెలిసిందో లేదో పిడుగుల్లా వచ్చి హాస్పటల్‌ని అల్లకల్లోలం చేయసాగారు.

వినసక్రతో విసిరేవాళ్ళు, కుశల ప్రశ్నలు వేసేవాళ్ళు, కాఫీ తెచ్చేవాళ్ళు, బ్రెడ్డు, పళ్ళు, పూలు తెచ్చేవాళ్ళు- ఒకటే రద్దీ.

మొత్తం వరండాను ఆక్రమించి పరిపాలన ప్రారంభించారు స్టూడెంట్స్.

రమణి స్టూడెంట్స్‌కు చాలా ఇష్టం. ఆమె అంటే వాళ్ళకు భక్తి. ఆమె తిట్టినా వాళ్ళకేం అభ్యంతరం లేదు. ఆమె పాఠం వాళ్ళకు ప్రాణం. ఆమె మాట, చేత, ప్రతి పని, ప్రతి కదలిక, ప్రతి శబ్దం, ప్రతి నిశ్శబ్దం వాళ్ళకు పరమ ఇష్టం. ఆమె అభిప్రాయాలు, ఆమె అభీష్టాలు, ఆమె ఆత్మీయతలు వీళ్ళవే అయ్యాయి.

రమణి వీళ్ళకొక చైతన్య సంకేతం. సుందర స్వప్నం. సుదూర సౌందర్యం. సువిశాల సౌజన్యం. ఆమె అంటే వాళ్ళకు వల్లమాలిన ఇష్టం. అలవిమాలిన అభిమానం. రమణికున్న అదృష్టం అందరు లెక్చరర్లకుంటే ఎంత పుణ్యం!

విద్యార్థినీ విద్యార్థులు, అమ్మ దగ్గరకో, అక్క దగ్గరకో వచ్చినట్లు రావటం చూస్తుంటే ఎవరికైనా ఆనందం కలుగుతుంది.

ఈమెకు ఎవరూ లేరనుకొంటున్న ఆడవాళ్ళకు ఇంత మంది ఉన్నారన్న తృప్తి ఎంతో ప్రశాంతిని ప్రసాదించింది.

అవ్వ అడిగింది.

'పుట్టింటోల్లు రాలే?'

'రారు!' రమణి చెప్పింది.

'అత్తింటోల్లు'

'రారు!'

'ఆయప్ప, పాప నాయినా రాలే?'

రమణి జవాబు చెప్పలేదు.

'లేడా?' రమణి నుదుట బొట్టుంది. చేతులకు గాజులున్నాయి. మెడలో సూత్రంలేదు.

'ఊర్లో లేడా? పొరుగూరు పోయేడా? యేరేసోటపనా?'

రమణి మాట్లాడలేదు.

'వదిలేశాడా? సుట్టపురాల్ని పెట్టుకొన్నాడా?'

జవాబు లేదు.

సాయంకాలం ఇరుగమ్మ పొరుగమ్మ వచ్చారు. చూశారు. పలకరించారు. పళ్ళూపూలు ఇచ్చారు.

కాలేజీ నుంచి లెక్చరర్లు, ఆడవాళ్ళు, మగవాళ్ళు వచ్చారు. చూశారు వెళ్ళారు. చాలా గౌరవంగా, మర్యాదగా ఉన్నారు.

అయితే ఆమె సొంతం వాళ్ళు ఎవరూ రాలేదు. ఇదిగో ఇప్పుడు పుట్టిన ఈ పురుటి గుడ్డు. రెండేళ్ళ బాబు! ఇంతే ఆమె సొంతం. పదేళ్ళ పాపకు ఈమె అండో, ఈ పాప ఆమెకు దిక్కో తెలియటంలేదు.

ఈ వచ్చేవాళ్ళు పోయేవాళ్ళు అత్తింటి వాళ్ళూకారు పుట్టింటి వాళ్ళూగారు. ఊరువాళ్ళూ కాదు. గేరివాళ్ళూ కాదు. వీళ్ళేమెకేమీకారు. ఏమీకారా? విద్యార్థులు, ఉద్యోగులు, లెక్చరర్లు, మిత్రులు. అంతా బాగుంది. బంధువులు? అవ్వ తలకాయలో పురుగు తిరుగుతూ ఉంది.

డాక్టరు వచ్చింది. అడ్మిషన్ షీట్ మీద నర్సు రమణి వివరాలు రాస్తూ వుంది. ఉద్యోగం, జీతం, చిరునామా, వయస్సు, డాక్టర్ అడిగింది. రమణి చెప్పింది. నర్సు రాసింది.

'భర్త పేరు?'

రమణి మాట్లాడలేదు.

డాక్టరు మళ్ళీ అడిగింది.

రమణి చెప్పింది 'అది అంత అవసరమా?'

క్షణకాలం డాక్టరు మాట్లాడలేదు. మాట తడబడింది. నర్సు చేయి వణికింది. వింటున్న అవ్వ మతిపోయింది. 'మొగుని పేరు సెప్పలేక' అనుకొంది. అంది. డాక్టరు రమణి ముఖంలోకి అనునయంగా చూచింది.

'అది అంత అవసరంకాదు' అంది రమణి. డాక్టరు నర్సుతో వెళ్ళిపోతూ మళ్ళీ వచ్చింది. అడిగింది.

'పాప తండ్రి పేరు?'

'అదీ అంత అవసరంకాదు.'


డాక్టరు అదోలా చూచింది.

'పాప తల్లిని నేను!'

డాక్టరు నర్సుతో వెళ్ళిపోయింది.

రమణి భర్తపేరు, పోనీ పాప తండ్రి పేరు చెప్పలేదు. చెప్పనంటుంది. వార్డంతా చెవులు కొరుక్కొంటున్నారు.

రమణి పుట్టిన రోజుల్లో, అతి బాల్యంలో ఆమె బుగ్గల మీదికి ఎక్కి కూర్చుని స్వారీ చేస్తున్న నవ్వు ఇంకా స్వారీ చేస్తూనే ఉంది. ఆరిపోలేదు. పారిపోలేదు. పడిపోలేదు. చెడిపోలేదు. స్వచ్ఛంగా, అచ్చంగా, అందంగా అలాగే ఉంది. అలసిపోలేదు. పలచబడలేదు. పసినవ్వు బుగ్గల్లో, ముఖంలో, కళ్ళలో, నుదుటిమీద, ముక్కుమీద, చెక్కిళ్ళమీద ఇంకా చిందాడుతూనే ఉంది.



ఉద్యోగి. విద్యావంతురాలు. మంచి జీతం. మంచి పేరు. మంచి పలుకుబడి. ఇరుగు పొరుగు వాళ్ళు. సహోద్యోగులు, స్టూడెంట్స్ ప్రేమిస్తున్నారు. గౌరవిస్తున్నారు, ఆరాధిస్తున్నారు. భర్తపేరు చెప్పదు. పాప తండ్రిపేరు చెప్పదు, ఇద్దరు పిల్లల తల్లి. ఇంతమంది ప్రేమించే తల్లి.

భర్త అవసరం కాదు, బిడ్డ పుట్టింది. తండ్రి అవసరంకాదు, పాప పెరుగుతుంది. అంటే అర్థం ఏమిటి? అవ్వకు తెలియటంలేదు.

అవ్వ కళ్ళు తిరుగుతున్నప్పుడు, భూమి తిరుగుతుందని నమ్మింది.

కాన్పయి, పగలంతా మేల్కొన్న రమణి పిల్లలు నిద్రపోయాక నెమ్మదిగా నిద్రలోకి జారిపోయింది.

మేల్కొని ఉన్న అవ్వ, నిద్రపట్టని అవ్వ, అంతా అయోమయంగా ఉన్న అవ్వ, పనిపాపను లేపింది. వద్దన్నా పాలిచ్చింది. కాదన్నా పండ్లు తినిపించింది. ప్రేమగా దగ్గరకు తీసుకొంది. బుగ్గలు నవరించింది. మూతి తుడిచింది. తలనిమిరింది. అడిగింది.

'ఈయమ్మ మొగుని పేరు, ఆ యప్పపేరు ఏంది పాపా?'

పాప కళ్ళు సుతారంగా తిప్పి 'గొత్తిల్ల' అంది.

'లగ్గంవయిందా?'

'గొత్తిల్ల!'

'ఎవులూ ఇంటికి వచ్చేదిలేదా?'

'వొత్తారు!'

'మొగొల్లు?'

'సారా? వొత్తారు.'

అవ్వ ఆనందంగా కూర్చుంది.

'మంచోడా?'

'వూం!'

'ఇంకిప్పుడొత్తాడా?'

'రాడు!'

'యాల?'

'అమ్మ రావొద్దన్లే!'

'యాపొద్దు?'

'వొ అల్లప్పుడు- ఆయాల రేత్రి. కోడి కుయ్యాలా అప్పుడు.'

'మల్ల?'

'రాలే!'

'ఆయాల, ఈయమ్మ, ఆ యప్పనేవంది?'

'నీముఖం, ఈ జన్మలో నాకు చూపకు-అనింటే నేయిన్నా. కాయంగా యినింటి'

అవ్వకు నీరసంగా ఉంది. పాప తల నిమిరింది. పడుకో అన్నట్లు సైగచేసింది. పాపకు విసనకర్రతో విసిరింది. ఆవులించింది.

'ఇంకెవురన్నా సార్లు మబ్బులో వొచ్చేవోలా?'

'వూహూ!' అని తల అడ్డంగా విసిరి పనిపాప నిద్రపోయింది.

ఉదయమే ఏమో తెచ్చిన విద్యార్థినితో అవ్వ అల్లంత దూరం తీసుకొనిపోయి కబుర్లు చెబుతూ 'ఈయమ్మకు లగ్గవయిందా?' అంది.

'మేడమ్‌కు పెళ్ళయిందో, కాలేదో మొగుడున్నాడో, ఊడాడో, మీకేమవసరం?'

'యాంలా. తెలిత్తే'

'తెలుసుకొని ఏంచేస్తారు?'

ఏం చేస్తుందో అవ్వకు తెలియదు. ఏమీ అనలేదు. తలమాత్రం ఆడిచింది. బొడ్లో నుంచి రోలు రోకలి తీసి ఆకొక్క దంచుకోసాగింది. అవ్వ రమణిని అంచనా వేస్తూ ఉంది. కట్ల పొడి ఆకొక్క అవ్వ ఆ బుగ్గనుంచి మార్చి ఈ బుగ్గలో నొక్కు కుంది.

ఉద్యోగి. విద్యావంతురాలు. మంచి జీతం. మంచి పేరు. మంచి పలుకుబడి. ఇరుగుపొరుగు వాళ్ళు. సహోద్యోగులు, స్టూడెంట్స్ ప్రేమిస్తున్నారు. గౌరవిస్తున్నారు, ఆరాధిస్తున్నారు. భర్తపేరు చెప్పదు. పాప తండ్రిపేరు చెప్పదు, ఇద్దరు పిల్లల తల్లి. ఇంతమంది ప్రేమించే తల్లి.

భర్త ఏడి? ఏమయ్యాడు? భర్త అవసరం ఏమిటి? మొగుడెందుకు? మగవాడెందుకు? పెళ్ళయితేనే పిల్లలు కలుగుతారా? భర్తలేని బతుకెట్లా? తండ్రి లేకపోతే పిల్లలకేంగతి? ఆయప్ప చస్తే సరి! పేరు చెప్పలేక, చెప్పకపోతే ఎట్లా? అవ్వకు రమణి అద్భుతంగా కనిపించసాగింది.

కాన్పు చేసిన డాక్టరు ఉదయం రౌండ్స్‌కు వచ్చింది. అందరినీ చూచింది. వరుసలో రమణి దగ్గరకు వచ్చింది. స్టూలు లాక్కుని దగ్గరగా కూర్చుంది. ఎక్కడా కూర్చోదు. నిలబడే పలకరిస్తుంది. అసలే గండుపిల్లి ముఖం. చిటపటలాడుతుంది. చిర్రుబుర్రుమంటుంది.

డాక్టరు అవ్వలాగా వొదిలి కూర్చుంది. అమ్మలాగా రమణి తల నిమిరింది. అక్కలాగా పలకరించింది. చెల్లిలాగా చీర సవరించింది. స్నేహితురాలులా నవ్వింది. ఆశ్చర్యం. డాక్టరు నవ్వుతుంది. ఇన్నిరోజుల్లో ఎప్పుడూ ఆమె నవ్వు చూడని అమ్మలక్కలు వొంగొంగితొంగితొంగి చూస్తున్నారు.

రమణి డాక్టరుకు ఆసుపత్రిలోనే పరిచయం. కాన్పుల గదిలోనే స్పర్శ. నిన్ననే మాటలు.

కానీ, ఎన్నో జన్మల నుంచి స్నేహితురాలయినట్లు నవ్వుతూ, పసిదానిలా కేరింతలు కొడుతూ, యువతిలా వయ్యారాలు పోతూ, సుందరాంగిలా మెలికలు తిరుగుతూ మాట్లాడుతుంటే రమణికూడా మైమరచిపోయింది.

నిజానికి రమణి సాన్నిహిత్యం డాక్టరుకు అన్ని అందాలు తెచ్చి పెట్టింది.

డాక్టరు వెంటనే డాక్టరు అయిపోయి, అడిగింది.

'భర్తపేరు, నీ పాప తండ్రిపేరు హాస్పటల్ రికార్డులో నమోదు చేయాలి. పాప బర్త్ సర్టిఫికెట్‌లో రాయాలి. ఇది ముందుముందు చాలా అవసరం!'

బర్త్ సర్టిఫికెట్ అన్నమాట భర్త సర్టిఫికెట్ లాగా వినిపించింది. అందుకే వెంటనే అంది-

'అవసరంలేదు'

'నామాట విను'

'అవసరంలేదు'

'ఆ కాలం పూర్తిచేయాలి. ఏదో పేరు రాస్తాను'

రమణి నవ్వింది. నిర్మలంగా నవ్వింది. నిశ్చలంగా చూచింది. స్వచ్ఛంగా నవ్వింది. అందంగా చూచింది. ఆదరంగా నవ్వింది. ఆప్యాయంగా చూచింది. ప్రేమగా నవ్వింది. స్వేచ్ఛగా చెప్పింది. 'అక్కరలేదు'

డాక్టరు మాట్లాడలేదు. రౌండ్స్‌కు వెళ్ళిపోయింది.

వార్డంతటికి రమణి వింత జంతువయింది.

'ఆమెకు పెళ్ళయిందా? కాలేదా?' అదీ వాళ్ళ సందేహం.

భర్త ఉన్నా, ఊడినా వాళ్ళకేమీ అభ్యంతరంలేదు.

రెండుసార్లు తల్లి అయిన రమణి భర్త సంగతి తెలియకపోవటమే వాళ్ళకు ఇబ్బందిగా ఉంది.

ఈ సందేహ నివృత్తి కోసం ఆడవాళ్ళంతా, వార్డంతా, హాస్పటల్ అంతా, జనమంతా, ఊరంతా, దేశమంతా, గందరగోళంలో పడే ప్రమాద సూచన కనబడుతూ ఉంది.

డిస్‌చార్జి అవుతున్న రోజు హాస్పటల్ నిండా స్టూడెంట్స్, ఫ్రెండ్స్, కొలీగ్స్.

డాక్టరు బర్త్ సర్టిఫికెట్ రమణి చేతికి స్తూ చెప్పింది.

'భర్త పేరు, అదే పాప తండ్రి పేరు లేకుండా బర్త్ సర్టిఫికెట్ ఇవ్వటం ఇదే మొదటిసారి.'

రమణి నవ్వింది.

'ఇదే చివరి-'

'చివరిసారి కాదు'

'మరి?'

'వందలు వేలు మీరే ఇస్తారు!'

'నీకే!?'

'లోకానికి!' కౌగిలించుకొన్నారు.

సామాను సర్దిపెట్టారు, తీసుకువెళ్ళారు స్టూడెంట్స్.

రమణి పసిగుడ్డును భుజాన వేసుకొని, కొడుకును చేయి పట్టుకొని హాస్పటల్ వరండాలో నడుస్తుంటే వెనుక చెంగుపట్టు కొని పనిపాప అనుసరిస్తూ ఉంది.

ఆమెతో హాస్పటల్‌కి వచ్చిన కాంతి, ఆమెతోనే వెళుతున్నట్లు అనుభూతి చెందింది డాక్టరు.

ఆమె వెంట స్టూడెంట్స్, ఫ్రెండ్స్, కొలీగ్స్. రమణి ఒక ఉద్యమం అనిపించింది.

డాక్టరు తృప్తిగా అనుకొంది.

"ముప్ఫైఏళ్ళ పసిగుడ్డు ఈ హాస్పటల్‌లో చేరి, నాచేత పురుడు పోయించుకొని, భవిష్యత్తులో ఈ లోకానికి జన్మనివ్వబోయే పసిగుడ్డును ప్రసవించి, ప్రపంచానికి బహుమతిగా ప్రసాదించింది." ●

# న్యూయార్క్ మ్యూజియమ్‌లో సంజీవ్‌దేవ్ లేఖలు

సుప్రసిద్ధ కళావిశ్లేషకుడు, రచయిత, కీర్తిశేషులు సంజీవ్‌దేవ్‌కు ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారుడు నికోలస్ రోరిక్‌కు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు న్యూయార్క్‌లోని నికోలస్ రోరిక్ మ్యూజియంలో వున్నాయి.

సంజీవ్‌దేవ్ చనిపోబోయేముందు వాటిని మ్యూజియమ్‌కు పంపించారు. న్యూయార్క్ నగరంలోని ఈచిన్న నికోలస్ రోరిక్ మ్యూజియమ్ జనబాహుళ్యానికి అంత ప్రసిద్ధికాకున్నా, కళాప్రియులకు తెలుసు. ఆంధ్రప్రదేశ్ నుండి బహుశా మొట్టమొదట ఈ మ్యూజియమ్‌ను సందర్శించిన కళా విమర్శకుడు చలసాని ప్రసాదరావు. పది సంవత్సరాల క్రితం తానా సభలకు వచ్చిన సందర్భంలో న్యూయార్క్‌లోని 107 వీధిలో వున్న నికోలస్ రోరిక్ మ్యూజియమ్‌ను వెతికి పట్టుకుని చలసాని ప్రసాదరావు వెళ్ళగా వారు ఆశ్చర్యపోయారు. అతనికి రోరిక్ ఆల్బమ్ బహూకరించారు కూడా. నేను మ్యూజియమ్ డైరెక్టర్ డేనియల్ ఎంటైన్‌ను కలసినప్పుడు ఈ విషయాలు చెప్పాడు. భారతీయులు అరుదుగానే ఈ మ్యూజియమ్‌కు వస్తారని చెప్పాడు. ఒక భారతీయుడు మ్యూజియమ్‌కు వచ్చినప్పుడు, భారతదేశంలో ప్రకృతి చిత్రాలను మొట్టమొదట ప్రవేశపెట్టింది నికోలస్ రోరిక్ అని వెల్లడించాడట.


సంజీవ్‌దేవ్

సంజీవ్‌దేవ్ కులు లోయలో వుంటున్న నికోలస్ రోరిక్‌తో అనేక ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపాడు. కలిశాడు కూడా. 1947 డిసెంబర్‌లో రోరిక్ చనిపోయినప్పుడు నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అతడికి ఘనంగా నివాళులు అర్పించాడు. ఆ మాటల్ని మ్యూజియమ్‌లో వుంచారు. మ్యూజియమ్ మూడు అంతస్తుల ఇంట్లో పెట్టారు. రోరిక్ రచనలు, చిత్రాలు, అతడు సేకరించిన వస్తువులు అట్టేపెట్టారు. ప్రతిరోజు సాయంత్రం రెండు నుండి అయిదు గంటల వరకు ఉచితంగా మ్యూజియమ్‌ను చూడనిస్తారు. క్యాసెట్లు, కార్డులు, పుస్తకాలు, చిత్రాలు అమ్మకానికి పెట్టారు కూడా. మ్యూజియమ్‌లో సంగీత కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తారు. అప్పుడప్పుడు కవితా గోష్టులు కూడా పెడతారు. ఇండియాలో కులువాలీలో హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం కూడా నికోలస్ పేరిట మందిరం నిర్మించి మ్యూజియమ్ స్థాపించాలని ఆలోచిస్తున్నాయి. రష్యా ప్రభుత్వం శ్రద్ధగా పట్టించుకుంటోంది. రోరిక్‌ను భారత జాతీయ సంపదగా ప్రభుత్వం భావిస్తోంది. న్యూయార్క్‌లోని రోరిక్ మ్యూజియమ్‌లో ఆశ్చర్యకరమైన రెండు చిత్రాలు ప్రదర్శనలో వున్నాయి. అవి ప్రవక్త మహ్మద్ చిత్రాలు. 1925లో ఒకటి, 1932లో మరొకటి చిత్రించినట్లు వుంది. సాధారణంగా మహ్మద్ చిత్రాలపట్ల ముస్లింలు అభ్యంతరం చెబుతారు. బహుశా న్యూయార్క్‌లో వున్నందున మినహాయించారేమో! సంజీవ్‌దేవ్ పేరిట జరిగే కార్యక్రమాలకు మ్యూజియమ్ అధ్యక్షుడు ఎడ్గర్ లాండ్స్‌బరిని పంపగలమని డైరెక్టరు చెప్పారు.

\- ఎన్. ఇన్నయ్య

# రత్నాలు కొన్ని ముఖ్యాంశాలు

కొన్ని రత్నాలకు గీట్లు, కొన్ని గుర్తులుంటాయి. అలాంటివాటిని ఆకృతి సంతకాలంటారు. చేతి వేళ్ళలో చూపుడువేలు బృహస్పతిని, మధ్యవేలు శనిని, రాహు కేతువులని,. ఉంగరం వేలు సూర్యుణ్ణి, మంగళగ్రహాన్ని చిటికినవేలు, బుధగ్రహాన్ని, చంద్రుణ్ణి బొటనవేలు, శుక్రున్ని సూచిస్తాయి. శుక్రగ్రహం అనువుగా ఉండేవాళ్ళు ఆ గ్రహ రత్నమైన వజ్రాన్ని ఉంగరం వేలికే ధరించాలి. ఉంగరంలో ఉన్న రత్నం వేలికి తాకినా తాకకున్నా ఉంగరం అడుగుభాగం మాత్రం తెరిచి ఉంచాలి. దాని ద్వారా సూర్యకిరణాలు శరీరంలోకి వెళ్లి వాటి ప్రభావాన్ని చూపుతాయి. భర్త ఎడమ చేతికి రత్నాన్ని ధరిస్తే భార్యకు ఎంతో మంచిది. భార్య కుడి చేతికి రత్నాన్ని ధరిస్తే భర్తకు మంచిది. గ్రహాలు మంచిగా ఉండటానికి రత్నాన్ని కుడిచేతికి ధరించాలి. గ్రహప్రభావాన్ని తగ్గించాలంటే ఆ గ్రహం రత్నాన్ని ఎడమచేతికి ధరించాలి. ఆడపిల్ల పెళ్లికి ముందురత్నాన్ని కుడి చేతికి ధరించాలి. పెళ్లి అయిన తర్వాత ఎడమ చేతికి ధరించాలి. ఉంగరాన్ని తీసేసిన తర్వాత దానిని ఎవరికి చూపించకూడదు. గ్రహాలకు ధరించే రత్నాలు కేవలం ఉంగరంలోనే కాదు మెడలో మాలగా, హారంగా ధరించవచ్చు. గ్రహాల ప్రభావం ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పలేం. ఒక్కోసారి తీవ్రంగా ఉండవచ్చు. మరోసారి ఉండకపోవచ్చు. అందుకని రత్నాన్ని ఎప్పుడూ ధరించడం మంచిది. ఎప్పుడూ ధరించడంవల్ల ఎటువంటి ఆపదలు కలుగవు.

\- డా॥ ఆమంచి బాలసుధాకరశాస్త్రి


చదవండి మీ విజ్ఞాన తృష్ణకు సరైన వేదిక చదివించండి

మహర్షి కాలజ్ఞానమ్
వేదజ్యోతిష విజ్ఞాన మాసపత్రిక
డా॥ ఆమంచి బాలసుధాకర శాస్త్రి సంపాదకత్వంలో
వేదము Vs సైన్సు - సమన్వయ వేదిక

సం॥ర చందాదారులు కండి
ఉచిత జాతకం, రుద్రాక్ష పొందండి
సభ్యులను చేర్పించుటకు ఏజంట్స్‌ను ఆహ్వానిస్తున్నాము.

శ్రీ మహర్షి పబ్లికేషన్స్

శ్రీ మహర్షి రుద్రాక్ష నవరత్న ఎంపోరియం
నం. 13, గాయత్రి టవర్స్, ఓల్డ్ బస్టాండ్ ఎదురుగా, విజయవాడ - 0866-570199
బ్రాంచి : 6-3-354/10, హిందీనగర్, పంజగుట్ట, హైదరాబాద్ - 040-6636696, Cell : 98490-17959
Contact franchise Cell